www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 28 ఏప్రిల్ 2025
5
కాకినాడ



సత్యదేవుని కల్యాణోత్సవానికి ఆహ్వానం

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం సత్యనారాయణ స్వామి వార్షిక కల్యాణోత్సవంలో పాల్గొనాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని దేవస్థానం అధికారులు ఆహ్వానించారు. ఆదివారం ఇఒ వీర్ల సుబ్బారావు అధికారులతో కలిసి మంత్రిని నెల్లూరులో కలిసి శుభలేఖను అందజేశారు. మే నెల 8వ తేదీన జరిగే స్వామి కల్యాణానికి కుటుంబ సమేతంగా హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇఇ సిని వాసు, పర్యవేక్షణాధికారి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.


మంత్రికి శుభలేఖను అందిస్తున్న ఇఒ సుబ్బారావు

డిసిసిబి పీఠం ఎవరికో..?

- పోటీ పడుతున్న ముఖ్య నేతలు
- విశ్వ ప్రయత్నాల్లో జ్యోతుల, పిల్లి
- తమకే కావాలంటున్న టిడిపి, జనసేన

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ది జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ లిమిటెడ్ (డిసిసిబి) ఛైర్మన్ పీఠం కోసం పలువురు కూటమి నేతలు విశ్వ ప్రయత్నాలు సాగిస్తున్నారు. తమకంటే తమకే పీఠం దక్కాలనే ఆశతో అటు టిడిపి అన్ని రకాల ప్రయత్నాలు చేస్తుండగా ఇటు జనసేన సైతం తామేమి తక్కువ అన్నట్లుగా ఆ పార్టీ నేతలు తరతమ స్థాయిలో పావులు కదుపుతున్నారు. త్వరలోనే మరికొన్ని నామినేటెడ్ పదవులను కూటమి సర్కారు భర్తీ చేయనున్న నేపథ్యంలో ఈ పీఠం ఎవరికి దక్కుతుందనేది చర్చనీయాంశంగా మారింది.

కూటమి ప్రభుత్వం డిసిసిబి, డిసిఎంఎస్ పదవులను త్వరలోనే భర్తీ చేయడానికి సిద్ధంగా ఉంది. దీనిలో డిసిసిబి పదవి ప్రధానంగా మారింది. ప్రతి ఏడాది సుమారు రూ.10 వేల కోట్ల టర్నోవర్‌తో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రైతులందరితో డిసిసిబి అనుబంధం కలిగి ఉంది. ఈ నేపథ్యంలో దీని అధ్యక్ష పదవి ఎంతో కీలకంగా మారింది. దీనికి ఛైర్మన్‌గా పని చేసే తగిన గౌరవం, హోదా దక్కుతుందని అంతా భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ పదవి కోసం గట్టి పోటీ నెలకొంది. అనేకమంది ఆశావహులు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల కొన్ని నామినేటెడ్ పదవులను భర్తీ చేసినప్పటికీ కొంతమంది ఆశావహులకు ఎటువంటి పదవి దక్కలేదు. సార్వత్రిక ఎన్నికల్లో పలు నియోజకవర్గాల్లో సీట్లు ఆశించిన వారికి నిరాశే మిగిలింది. టిడిపి జిల్లా అధ్యక్షుడుగా ఉన్న మెట్ట ప్రాంతానికి చెందిన జ్యోతుల నవీన్ కాకినాడ ఎంపీ సీటుని ఆశించారు. కానీ పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించారు. ప్రస్తుతం ఆయన డిసిసిబి ఛైర్మన్ పదవి ఇవ్వాలని ఆయన అనుచరులు కొంతకాలంగా గట్టిగా



కోరుతున్నారు. నవీన్ కూడా తనకు తగిన గుర్తింపు ఇవ్వాల్సిందిగా సందర్భం వచ్చినప్పుడల్లా అటు చంద్రబాబు, ఇటు లోకేష్ వద్ద ప్రస్తావనకు తీసుకుని వస్తున్నట్లుగా తెలుస్తోంది.

మరోవైపు కాకినాడ రూరల్ మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి భర్త పిల్లి సత్తిబాబు తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. పొత్తులో భాగంగా రూరల్ అసెంబ్లీ నియోజకవర్గ సీటుని జనసేనకు కేటాయించడంతో సీనియర్ నేతగా ఉన్న తనకు కీలక పదవి లభిస్తుందని సత్తిబాబు ఎప్పటినుంచో ఆశిస్తున్నారు. దానికి తగ్గట్లుగానే ఈసారి డిసిసిబి పదవిని టిడిపి బిసిలకు ఇవ్వాలనే డిమాండ్‌ను ఆయన తెరమీదకు తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలోనే టిడిపి అధిష్టానం వద్ద తన ప్రతిపాదనను పెట్టి పదవి కోసం పైరవీలను ముమ్మరం చేశారు. పెద్దాపురం ఎంఎల్ఎ చినరాజప్ప కూడా సత్తిబాబుకు అవకాశం ఇవ్వాలని, దీని ద్వారా సామాజిక సమతుల్యత ఏర్పడుతుందని అధిష్టానం వద్ద తెలియజేసినట్లు ప్రచారం జరుగుతుంది. ఆయనతో పాటు, మరికొంతమంది ఎంఎల్ఎలు పిల్లికి మద్దతు తెలుపుతున్నట్లుగా సమాచారం.

మాజీ మంత్రి కుమారుని ఆశలు

కోనసీమ ప్రాంతానికి చెందిన సీనియర్ నేత, దివంగత మాజీ మంత్రి మెట్ల సత్యనారాయణ కుమారుడు మెట్ల రమణబాబు డిసిసిబి ఛైర్మన్ పదవి కోసం గత కొన్నేళ్లుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు కాంగ్రెస్ అధికారంలో ఉండగా డిసిసిబికి జరిగిన ఎన్నికల్లో టిడిపి తరపున రమణబాబు పోటీ చేసి విజయం సాధించలేకపోయారు. కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన దివంగత వరుపుల రాజాకి ఈ పదవి దక్కింది. 2014-19 మధ్య టిడిపి అధికారంలో ఉన్నప్పటికీ ఆయనకు ఈ పదవి దక్కలేదు. దీంతో ఈసారైనా ఛైర్మన్ అవకాశం వస్తుందనే ఆశతో ఆయన ప్రయత్నాలు గట్టిగానే జరుపుతున్నారు. అయితే ఎప్పుడూ ఈ పదవిని కాపు సామాజిక వర్గానికే కేటాయిస్తున్నందున ఈసారి బిసిలకు అవకాశం ఇవ్వాలనే ప్రతిపాదన తెరమీదకు వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో రమణబాబు ఆశలు నెరవేరే అవకాశం కనిపించడం లేదు.

పట్టు కోసం జనసేన

రాష్ట్ర డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ కాకినాడ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పిఠాపురం ఎంఎల్ఎగా ఆయన పని చేస్తున్నారు. పార్టీని ఉమ్మడి జిల్లాలో మరింత బలోపేతం చేయాలని జనసేన అధిష్టానం ఆశిస్తోంది. ఈ నేపథ్యంలోనే కూటమిలో భాగంగా ఉన్న జనసేన కీలక పదవులను తీసుకునేందుకు గట్టిగా పట్టు బిగిస్తోంది. ఇప్పటికే కుడా ఛైర్మన్ పదవితో పాటు సివిల్ సప్లై కార్పొరేషన్ ఛైర్మన్ పదవిని జనసేన నాయకులే తీసుకున్నారు. ప్రస్తుతం డిసిసిబి ఛైర్మన్ పదవిని తమ పార్టీ ఖాతాలో వేసుకోవాలని పార్టీ ముఖ్య నేతలు భావిస్తున్నారు. ఇటీవల జిల్లాకు వచ్చిన పవన్ కళ్యాణ్ వద్ద ఈ విషయాన్ని జిల్లా నేతలు ప్రస్తావించినట్లు సమాచారం. ఇలా డిసిసిబి పదవి కోసం ఎవరి ప్రయత్నాల్లో వారున్నారు. పీఠం ఎవరికి దక్కుతుందనేది ప్రస్తుతానికి ఆసక్తికరంగా మారింది.

నీట్ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - కాకినాడ

మెడికల్ కాలేజీలో ప్రవేశానికి మే 4వ తేదీన నీట్ పరీక్ష నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని డిఆర్ఒ జె.వెంకట్రావు ఆదేశించారు. ఆదివారం నీట్ నిర్వహణకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. మే 4వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకూ నగరంలోని 10 పరీక్ష కేంద్రాల్లో ఒఎంఆర్ విధానంలో జరుగుతుందన్నారు. ఈ పరీక్షకు జిల్లాలో 2880 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. ఎంపిక చేసిన 10 సెంటర్లలో పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆయన కోరారు. అన్ని కేంద్రాలకు కాంపౌండ్ వాల్ తప్పని సరిగా ఉండాలని, కేంద్రాలన్నింటిలో సిసి కెమెరాలతో నిఘా పర్యవేక్షణ ఉండాలన్నారు. వేసవి ఉష్ణోగ్రతల దృష్ట్యా పరీక్ష కేంద్రాలన్నింటిలో తాగునీరు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. పరీక్షల నిర్వహణకు రెగ్యులర్ ఉద్యోగులను మాత్రమే ఇన్విజిలేటర్లుగా నియమించాలని, సైన్స్ బోధనా నేపథ్యం కలిగిన వారిని నియమించరాదన్నారు.

బాక్సింగ్ క్రీడాకారిణికి ఎంపీ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కాకినాడ

రాజమహేంద్రవరం నగరానికి చెందిన జాతీయ బాక్సింగ్ క్రీడాకారిణి షేక్ నస్రీన్‌కు ఎంపి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ఆర్థిక సాయాన్ని అందించారు. చిన్నతనం నుంచి బాక్సింగ్ క్రీడపై మక్కువ పెంచుకున్న నస్రీన్ కుటుంబ సభ్యులు, దాతల ప్రోత్సాహంతో ఇప్పటికే రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక పతకాలు సాధించి బాక్సింగ్‌లో మంచి ప్రతిభ కనబరిచింది. తన అసమాన ప్రతిభతో నస్రీన్ 2019లో ఉత్తమ బాక్సర్‌గా అవార్డు అందుకుంది. 2028లో అమెరికాలో లాస్ ఏంజెల్స్ లో నిర్వహించనున్న ఒలంపిక్స్‌లో పాల్గొని దేశానికి పతకం అందించడమే లక్ష్యంగా సాగుతున్న నస్రీన్‌కు ఆర్థిక కష్టాలు చుట్టుముట్టాయి. ఒక ప్రయివేటు కంపెనీలో గుమస్తాగా పని చేస్తున్న నస్రీన్ తండ్రి షేక్ మస్తాన్ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం కావడంతో రాబోయే రోజుల్లో జాతీయ, అంతర్జాతీయ బాక్సింగ్ పోటీల్లో పాల్గొనడంతో పాటు, ఒలంపిక్స్ క్రీడలకు సన్నద్ధం అవ్వాలంటే భారీగా ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావడంతో దాతల ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తుంది. ఈ నేపథ్యంలోనే నస్రీన్ తన సోదరుడితో కలిసి శనివారం కాకినాడ క్యాంప్ కార్యాలయంలో ఎంపి ఉదయ్ శ్రీనివాస్‌ను కలిసి పరిస్థితిని వివరించారు. దీంతో ఆయన అప్పటికప్పుడు రూ.1.28 లక్షల నగదును నస్రీన్‌కు అందించారు. భవిష్యత్తులో అన్ని విధాల అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా నస్రీన్ మాట్లాడుతూ సాయం చేయాలని తలుపు తట్టిన మొదటి రోజునే ఒక సోదరుడిలా ఎంపి ఉదయ్ శ్రీనివాస్ ఆర్థిక సాయాన్ని అందించారని కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఏడాది మే నుంచి డిసెంబర్ వరకు ఢిల్లీలో జరిగే శిక్షణకు వెళ్తున్నట్లు చెప్పారు. అందరి ఆశీస్సులతో వచ్చే ఒలంపిక్స్‌లో కచ్చితంగా పతకం సాధిస్తానని షేక్ నస్రీన్ తెలిపారు.


క్రీడాకారిణికి అభినందిస్తున్న ఎంపి తంగెళ్ల

మత్స్యకారుల దశ మారింది : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - కాకినాడ

కూటమి ప్రభుత్వ పాలనలో మత్స్యకారుల దశ మారిందని ఎంఎల్ఎ వనమాడి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం బోటు ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వేట నిషేధ సమయంలో ఆర్థికసాయం రెట్టింపు చేసి కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేయడం జరిగిందని అన్నారు. గత పాలకులు మత్స్యకారులను నమ్మించి మోసం చేశారన్నారు. ఫిష్ ఆంధ్ర పేరుతో మత్స్యకారుల సొమ్ములను దోచుకున్నారని, 2014లో తొలిసారిగా టిడిపి ప్రభుత్వమే వేట నిషేధ సమయంలో మత్స్యకార కుటుంబాలకు మత్స్యకార భృతిని ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సంఘాని నాగేశ్వరరావు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పంతాడి రాజు, నాయకులు బలసాడి రంగారావు, చింతా పేర్రాజు, పినపోతు తాతారావు, తదితరులు పాల్గొన్నారు.



సిఎం, డిప్యూటీ సిఎం చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న మత్స్యకారులు

నేడు యథావిధిగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్ కార్యక్రమం సోమవారం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలులో ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు విధిగా హాజరు కావాలని ఆయన ఆదేశించారు. మండల స్థాయిలో జరిగే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు అందరూ విధిగా ఉదయం 9:30 గంటలకు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అర్జీదారులు గమనించాలని ఆయన కోరారు.

దీక్ష విరమించిన వికలాంగులు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత 3 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న వికలాంగులు అధికారుల హామీతో దీక్షను విరమించారు. ఆదివారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల వికలాంగుల సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ కె.రాజు, జిల్లా వికలాంగుల ప్రభుత్వ సలహా కమిటీ సభ్యులు మేడపట్టి బాతిరెడ్డి దీక్షా శిబిరాన్ని సందర్శించారు. వికలాంగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని కమిషనర్ కనకారావు హామీ ఇచ్చారని వికలాంగులకు వివరించి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప చేశారు. అనంతరం కమిషనర్ కనకారావును వికలాంగులు కలిశారు. సమితి జిల్లా అధ్యక్షులు ఉలవశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ వికలాంగుల హక్కుల చట్టం 2016 అమలుకు కృషి చేస్తామని, అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో ఐదు శాతం నిధులు కేటాయింపులు చేస్తామని, రాయితీపై రుణాల మంజూరులో తగు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో దీక్షను విరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ స్పందన వికలాంగుల సంక్షేమ సంఘం కార్యదర్శి బివివి.సత్యనారాయణ, వికలాంగులు పాల్గొన్నారు.



దీక్షను విరమింప చేస్తున్న అధికారులు

ఎన్‌సిసి శిక్షణా శిబిరంలో రక్తదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో 18 ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణా శిబిరంలో ఆదివారం రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత అవగాహన ర్యాలీ జరిగింది. సుబేదార్ మేజర్ కె.హేమంత్ కుమార్ రక్తదానం చేశారు. అనంతరం పిఐ స్టాఫ్, ఎన్‌సిసి క్యాడెట్లు రక్తదానం చేశారు. క్యాంప్ కమాండెంట్ మేజర్ కె.మహమ్మద్ ఆసిఫ్ మాట్లాడుతూ ఎన్‌సిసి క్యాడెట్లకు క్రమశిక్షణ, ఐకమత్యం, దేశభక్తి తో పాటు సామాజిక బాధ్యత కూడా ఉందని ఈ రక్తదాన శిబిరం నిరూపించిందన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.దుర్గరాజు, క్యాంపు ఎడ్యుటెంట్ లెఫ్ట్‌నెంట్ సనపల సత్యనారాయణ, అధికారులు కె.రాంబాబు, రాంప్రసాద్, జివివి.ప్రసాద్, సిహెచ్.అబ్బులు, తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న ఎన్‌సిసి క్యాడెట్లు

ఖాతాదారుల సేవలో టౌన్ బ్యాంక్

ప్రజాశక్తి - కాకినాడ

ఖాతాదారులకు మరిన్ని సేవలను ది కాకినాడ కోఆపరేటివ్ టౌన్ బ్యాంకు లిమిటెడ్ అందిస్తోందని, ఈ ఏడాది మార్చి 31వ తేదీ నాటికి రూ.15.53 కోట్ల నికర లాభం ఆర్జించిందని టౌన్ బ్యాంక్ ఛైర్మన్ చిట్టూరి రవీంద్ర తెలిపారు. రాష్ట్రంలో ఉన్న కోఆపరేటివ్ బ్యాంకుల్లో 46 బ్రాంచీలతో రెండవ స్థానంలో ఉందన్నారు. ఆదివారం స్థానిక సుబ్బయ్య గ్రాండ్ హోటల్లో ఖాతాదారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మార్చి 31కి రూ.1,110.40 కోట్ల డిపాజిట్లు, రూ.750.16 కోట్లు రుణాలు ఉన్నట్లు చెప్పారు. ఖాతాదారులకు మేలైన సేవలు అందించి వారి మన్ననలను పొందుతున్నట్లు తెలిపారు. టౌన్ బ్యాంకులో ఫోన్ పే, గూగుల్ పే, మొబైల్ బ్యాంకింగ్, ఎస్ఎంఎస్ సౌకర్యాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రస్తుతం బ్యాంకు 8 ఎటిఎంలు ఏర్పాటు చేయగా ఆరు సొంత భవనాలు కలిగి ఉన్నాయన్నారు. నిర్వహణ లేని ఖాతాల సొమ్మును గత ఏడాది మార్చి 31వ తేదీ నాటికి రూ.2.54 కోట్ల రూపాయలను రిజర్వ్ బ్యాంకు ఖాతాకు పంపించినట్లు చెప్పారు. ఒకవేళ ఎవరైనా ఖాతాదారులు తమ ఖాతా సొమ్మును వాపస్ చేయమని కోరితే వారి గుర్తింపును పరిశీలించి నిర్ణీత దరఖాస్తు ఆధారంగా ముందస్తుగా బ్యాంకు చెల్లింపులు చేసి ఆ మొత్తానికి తగిన ఆధారాలతో రిజర్వ్ బ్యాంక్ నుంచి క్లైమ్ చేసుకోవాలని తెలిపారు. నిర్వహణలో లేని ఖాతాలను పునరుద్ధరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. బ్యాంకు నుంచి ఏడాదికి పౌరులకు రూ.50 వేలు, సీనియర్ సిటిజనులలో లక్ష రూపాయలు వడ్డీ తీసుకునే వారికి పన్ను మినహాయించాలని ఉన్నా వీరు 15జి లేదా 15హెచ్ ఫారాలను అందించి పొందాలన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం గత బడ్జెట్లో ఈ మినహాయింపు పొందేందుకు వ్యక్తులు ఫోన్ నెంబర్లతో పాటు ఆధార్ కార్డు అనుసంధానం తప్పనిసరి చేసిందన్నారు. కావున ఫోన్ నెంబర్, ఆధార్ అనుసంధానం బ్యాంకు ఖాతాకు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఖాతాదారులు అడిగిన ప్రశ్నలకు, సందేహాలను రవీంద్ర నివృత్తి చేశారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు సత్తి రామారెడ్డి, రిమ్మలపూడి ధర్మేంద్ర, కంటిపూడి సత్యనారాయణ, సిఇఒ సి.సుగుణరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్మన్ చిట్టూరి రవీంద్ర

మే 2 నుంచి శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - కాకినాడ

భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ), ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) ఆధ్వర్యంలో మే 2 నుంచి 10వ తరగతిలో ప్రవేశించిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నగర అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్.వరహాలు బాబు, బి.రవిశ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష కార్యదర్శులు ఎ. సంజయ్, ఎ. వాసుదేవ్ మాట్లాడారు. మే 2 నుంచి 31 వరకు 10 వ తరగతి సబ్జెక్టులపై నిపుణులైన ఉపాధ్యాయులతో ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి 10.30 గంటల వరకూ ఈ క్లాసులు జరుగుతాయన్నారు. నగరానికి చెందిన వారితోపాటు, పరిసర ప్రాంతాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆశక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 30 లోపు ఫోన్ ద్వారా తమ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. 9441710273, 9441251462, 9346264224, 7893211869 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

మే 12న కాకినాడలో మాలల మహా రణభేరి

ప్రజాశక్తి - కిర్లంపూడి

మాల మహానాడు వ్యవస్థాపకులు పివి.రావు జయంతి సందర్భంగా కాకినాడలో మే 12న మాలల మహా రణభేరి కార్యక్రమాన్ని నిర్వమించనున్నట్లు రాష్ట్ర మాల సంఘాల జెఎసి అధ్యక్షులు పండు అశోక్ కుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద మాలల మహారణభేరి కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా ఎస్‌సిలను అణిచివేసే కుట్రలో భాగమే వర్గీకరణ చేశాయని అన్నారు. ఎస్‌సిల ఐక్యతను కోరుకునే వారంతా వర్గీకరణను వ్యతిరేకించాలని కోరుతూ మే 12న కాకినాడలో నిర్వహించే మాలల మహా రణభేరి సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాల సంఘాల నాయకులు లింగ శివకుమార్, బుంగ సతీష్‌కుమార్, కండవెల్లి లోవరాజు, మత్ర చిట్టిబాబు, బులుపే గోపి, మద్దాల సురేష్, కాకర అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాల ప్రతినిధులు

30 నుంచి అథ్లెటిక్స్‌పై శిక్షణ

ప్రజాశక్తి - పెద్దాపురం

ఈ నెల 30 నుంచి మే 31వ తేదీ వరకు స్థానిక మహారాణి కళాశాలలో బాల, బాలికలకు అథ్లెటిక్స్‌లో శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ కమిటీ జిల్లా అధ్యక్షులు టివిఎస్ రంగారావు, సెక్రటరీ కె.సుబ్రహ్మణ్యం, కోశాధికారి ఎస్‌విఎల్‌జి.వర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాఅథ్లెటిక్స్ అసోసియేషన్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిబిరాన్ని ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభిస్తారన్నారు. ఈ శిబిరంలో జిల్లా పరిధిలో క్రీడాకారులు మాత్రమే పాల్గొనేందుకు అర్హులన్నారు. 8 నుంచి 16 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వారు ఈనెల 28వ తేదీలోగా వాట్సాప్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలన్నారు. బాలురకు రెసిడెన్షియల్ క్యాంపు, బాలికలకు నాన్ రెసిడెన్షియల్ క్యాంపు నిర్వహించబడుతుందన్నారు. ఈ శిబిరంలో పాల్గొనే ఆసక్తి కలవారు ఆధార్ కార్డు జిరాక్స్‌తో 30వ తేదీ మధ్యాహ్నం 2:30 గంటలకు రిపోర్ట్ చేయాలన్నారు.

నేటి నుంచి వేసవి శిక్షణా శిబిరం

ప్రజాశక్తి - పెద్దాపురం, ఏలేశ్వరం, సామర్లకోట

ఈనెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు స్థానిక శాఖా గ్రంథాలయంలో పాఠశాలల విద్యార్థులకు వేసవి శిక్ణాణా శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి పాలంకి నాగరాజు తెలిపారు. ఈ శిక్షణా శిబిరంలో కథలు వినడం, కథలు చెప్పడం, కథలు చదవడం, పుస్తకాలు చదవడం, దేశభక్తి పాటలు పాడడం, స్పోకెన్ ఇంగ్లీష్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తారన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ పరిధిలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏలేశ్వరం శాఖా గ్రంథాలయంలో నిర్వహించే వేసవి విజ్ఞాన తరగతులను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ పాలకుడు కవికొండల సత్యనారాయణ కోరారు. అలాగే సామర్లకోట శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు నేటి నుంచి జూన్ 6వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారి బందీల రత్నామణి చెప్పారు. ఆదివారం సాయంత్రం ఆమె విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకూ కథలు చెప్పడం, కథలు చదవడం, చిత్రలేఖనం, పేపర్ క్రాఫ్ట్, సంగీతం తదితర అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. ఈ వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

ప్రయివేటులో పేద విద్యార్థులకు ఉచిత విద్య

ప్రజాశక్తి - ఏలేశ్వరం


ఆర్థికంగా వెనుకబడిన, ప్రతికూల పరిస్థితుల పిల్లలకు ప్రయివేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో ప్రభుత్వం ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు ఎంఇఒ బి.అబ్బాయి తెలిపారు. ఒకటవ తరగతిలో 2025-26 సంవత్సరంలో విద్యను అభ్యసించేందుకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 28 నుంచి మే 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని పేద విద్యార్థుల సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

30న గొల్లప్రోలు కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

నగర పంచాయతీ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ గంద్రేటి మంగతాయారు అధ్యక్షతన ఈ నెల 30వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఎం.కనకారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, సంబంధిత శాఖ అధికారులు విధిగా హజరుకావాలని కోరారు.

కార్టూ'నిజం'



పేద విద్యార్థులకు పాలీసెట్‌లో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - పెద్దాపురం

పేద మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులను ఇంజనీర్లుగా తీర్చిదిద్దాలని లక్ష్యంతో పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్, ఎస్ఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో ఉచిత పాలిసెట్ కోచింగ్ నిర్వహించబడుతుంది. అనుకున్న లక్ష్యానికి మంచి విద్యార్థులు ఉచిత శిక్షణ కోసం రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. పెద్ద సంఖ్యలో అందరూ శిక్షణ తీసుకుంటున్నారు. విద్య వ్యాపారంగా మారిపోయిన ప్రస్తుత సమాజంలో ధనవంతుల పిల్లలు పెద్ద పెద్ద కోచింగ్ సెంటర్లలో అధిక ఫీజులు చెల్లించి శిక్షణ పొందుతుంటే పేద కుటుంబాల పిల్లలు నిస్సహాయంగా చూస్తూ టెక్నికల్ కోర్సులకు దూరంగా ఉండిపోతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని పిసిసి, ఎస్ఎఫ్ఐ సాహసోపేతంగా పేద విద్యార్థులకు ఈ శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. 70 మంది ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. ప్రతిరోజు ఆరు గంటల పాటు ఈ కోచింగ్‌లో బోధించడం, సందేహాల నివృత్తి, పాఠ్యాంశాలపై పరీక్షలు, మూడు రోజులకు ఒకసారి గ్రాండ్ టెస్ట్ నిర్వహిస్తున్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ శిక్షణా శిబిరం నిర్వహించబడుతుంది. ఈ శిక్షణా శిబిరంలో భౌతిక, రసాయన శాస్త్రాలు బోధించేందుకు సీనియర్ ఉపాధ్యాయుడు బుద్ధా శ్రీనివాస్, మ్యాథమెటిక్స్ బోధించేందుకు నీలపాల బాలమురళీకృష్ణ ముందుకొచ్చి సెలవుల సమయాన్ని కుటుంబానికి పరిమితం చేయకుండా పేద కుటుంబాల విద్యార్థుల ఉన్నతికి కేటాయించి తమ శిక్షణను దిగ్విజయంగా నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు అవసరమైన మౌళిక సదుపాయాలు నిర్వాహకులు ఉచితంగా అందజేస్తున్నారు. 'అందరికీ ఉచిత విద్య అందరికీ ఉపాధి' లక్ష్యంతో ఈ శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిక్షణ శిబిరంలో దేవత రాజేష్ కుమార్, నెల్లూరి హర్ష వంటి దాతల సహాయ సహకారాలతో విద్యార్థులందరికీ అవసరమైన పాలీసెట్ కోచింగ్ మెటీరియల్ ఉచితంగా అందజేశారు. విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాల కల్పన, కోచింగ్ నిర్వహణకు సమన్వయకర్తలుగా పిసిసి సభ్యులు అమృత, నమ్రత, మణికంఠ వ్యవహరిస్తున్నారు. పిసిసి అధ్యక్ష, కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్‌కుమార్ సేవలందిస్తున్నారు. ఈ శిక్షణలో సామాజిక అంశాలపైనా అవగాహన కల్పిస్తున్నారు. పూలే, డాక్టర్ బిఆర్.అంబేద్కర్, కందుకూరి వీరేశలింగం జయంతి కార్యక్రమాలను నిర్వహించారు. జమ్మూ కాశ్మీర్లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ, మరణించిన పర్యాటకులకు నివాళులర్పిస్తూ శిక్షణ పొందుతున్న విద్యార్థులతో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు(ఫైల్ ఫొటో)

జగ్గంపేటలో ఉచిత కోచింగ్ సెంటర్

జగ్గంపేటలో యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ, జెవివి ఆధ్వర్యంలో ఉచిత పాలిసెట్ కోచింగ్ 50 మంది విద్యార్థులతో నిర్వహిస్తున్నారు. వివిధ గ్రామాల నుంచి విద్యార్థులు వచ్చి శిక్షణ పొందుతున్నారు. ఉపాధ్యాయులుగా డి తమ్మాయిత, కె.సూర్యనారాయణ, కె.బంగారయ్య, పివి.గంగాధర్, ఎం.మురళీకృష్ణ, కె.ఈశ్వరరావు శిక్షణ ఇస్తున్నారు. సమన్వయకర్తలుగా ఆయా ప్రజాసంఘాల నాయకులు జి.వెంకటేశ్వరరావు, బి.కోటేశ్వరరావు, మణికంఠ, పి.బాలాజీ, జిఎస్‌హెచ్‌పి.వర్మ వ్యవహరిస్తున్నారు.

నేరాలు ఘోరాలు

అంతరాష్ట్ర నేరస్తుల అరెస్ట్
రూ.40 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

ప్రజాశక్తి - అమలాపురం

ముగ్గురు అంతరాష్ట్ర నేరస్తులను ఆదివారం అరెస్ట్ చేసి వారి నుంచి రూ.40లక్షలు విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. దీనికి సంబంధించి ఎస్పి బి.కృష్ణారావు వివరాలు వెల్లడించారు. నరసారావుపేట మండలం పమిడిపాడు గ్రామానికి చెందిన జంగా వెంకట్రావు, రాజుపాలెం మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన దమ్ము సుధాకర్, గుంటూరు అర్బన్ జిల్లా కు చెందిన కట్ల కిషోర్ బాబులు ఇంటి తలుపుల టవర్ బోల్ట్‌ను తీసి లేదా ఐరన్ రాడ్ తో తలుపు గెడను తీసి నేరం చేయడంలో నేర్పరులని అన్నారు. అమలాపురం పట్టణం కురసాల వారి వీధిలో ఒక డాబా ఇంటిలో జనవరి 12న రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఇంటి తలుపు బోల్ట్ తీసి ఇంటిలోనికి ప్రవేశించి యజమాని గదిలో నిద్రిస్తున్న సమయంలో బీరువాలోని బంగారు నగలు, నగదు దొంగిలించుకొని పోయారని అన్నారు. దీనిపై అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశామన్నారు. ఈ ముగ్గుర్ని నరసాపురం వద్ద ఆదివారం అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.40 లక్షల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పి తెలిపారు. వీరి నుంచి 400 గ్రాములు బంగారం, 500 గ్రాములు వెండి, ఆరు సెల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిపై రావులపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కేసు, అమలాపురం టౌన్ స్టేషన్‌లో మూడు కేసులు, తూర్పుగోదావరిలో రెండు, ఏలూరులో మూడు, గుడివాడలో ఒకటి, నంద్యాలలో రెండు, కడపలో ఒకటి, కర్నూల్‌లో ఒకటి, అనంతపురంలో ఒకటి, వెస్ట్ గోదావరిలో ఒకటి, అన్నమయ్య జిల్లాలో ఒక కేసు నమోదయిందని ఎస్పి చెప్పారు. సుమారు 13 నేరాల్లో వీరు నిందితులుగా వున్నారన్నారు. వీటితో పాటు మరో నాలుగు కేసుల్లో నిందితులని ఎస్పి తెలిపారు. నిందితులు అమలాపురం కురసాల వారి వీధిలో 2024 ఒక చోరీ, అమలాపురం గాంధీనగర్‌లో 2023లో మరొక చోరీ చేశారన్నారు. ఈ కేసును అమలాపురం డిఎస్‌పి టియస్ఆర్‌కె.ప్రసాద్, పట్టణ సిఐ పి. వీరబాబు, అమలాపురం టౌన్ క్రైమ్ సిఐ ఎం.గజేంద్ర, పట్టణ ఎస్ఐ కిషోర్ బాబు సిబ్బందిని ఎస్‌పి బి.కష్ణారావు అభి నందించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - కొత్తపేట

అనుమతి లేకుండా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు, రెవెన్యూ అధికారులు ఆదివారం సీజ్ చేశారు. వివరాలు ఇవి.. అందిన సమాచారంపై ఎస్ఐ జి.సురేంద్ర, సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది కలసి మోడెకుర్రు ఆంజనేయస్వామి గుడి ఎదురుగా ఆదివారం ఉదయం వాహనాలను తనిఖీ చేస్తున్నారు. అమలాపురం వైపు నుంచి వస్తున్న ఆలమూరు మండలం నర్సిపూడి గ్రామం చెందిన వ్యాన్‌ను తనిఖీ చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా రేషన్ బియ్యం తరలిస్తున్నందున ఆ వ్యాన్ ను సీజ్ చేశారు. వ్యాన్‌లోని 73 బస్తాల రేషన్‌బియ్యం (3వేల కేజీలు) స్వాధీనం చేసుకున్నారు. దీనిపై ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడిపందేలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని కొడవలి గ్రామ శివారు కొండ వద్ద నిర్వహిస్తున్న కోడిపందెం శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో రెండు కోడి పుంజులు, రూ.4,300 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురు వ్యక్తులను అదుపులో తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

ఆటో డ్రైవర్ హత్య

ప్రజాశక్తి - కాకినాడ

మద్యానికి డబ్బులు ఇవ్వలేదనే కోపంతో తోటి స్నేహితులే ప్రాణం తీసిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...స్థానిక రేచర్లపేటలో గంజాయి మత్తులో ఉన్న నలుగురు వ్యక్తులు వారి స్నేహితుడైన గౌతమ్ (27)ను మద్యానికి డబ్బులు అడిగారు. తన దగ్గర డబ్బులు లేవని చెప్పడంతో అతనిపై రాళ్ళతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. కుటుంబ సభ్యులు అతనిని జిజిహెచ్‌కు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టిప్పర్ ఢీకొని నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మోటారుసైకిల్, టిప్పర్ లారీ ఢీ కొన్న ఘటనలో నలుగురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఐ.పోలవరం మండలం టీ కొత్తపల్లికి చెందిన ఉందుర్తి బాలు, కాకినాడ గొల్ల పాలేనికి చెందిన ఖండవల్లి రాజా, అయినవిల్లి మండలం శంకరాయ గూడెంనకు చెందిన నిడుమోలు ఉమామహేశ్వరరావు, టి.కొత్తపల్లి కి చెందిన బొమ్మి వినోద్‌లు ఆదివారం యానం నుండి ఒకే మోటార్ సైకిల్ పై తిరిగి వస్తున్నారు. ఈ సమయంలో జాతీయ రహదారి216 పై అన్నంపల్లి టోల్ ప్లాజా వద్ద ఎదురుగా వస్తున్న వీరి మోటార్‌సైకిల్‌ను టిప్పర్ లారీ ఎదురుగా ఢీ కొంది. ఈ ప్రమాదానికి నలుగురు గాయపడ్డారు. వారిలో ఉందుర్తి బాలు పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. గాయపడిన వారిని అంబులెన్స్ లో అమలాపురం ఆసుపత్రి తరలించారు ఈ మేరకు ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలా సాగర్ కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - నల్లజర్ల

పుల్లలపాడు 16 నంబరు జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. స్థానికులు బంధువులు తెలిపిన వివరాల ప్రకారం దేవరపల్లి గ్రామానికి చెందిన, దాసు దుర్గాప్రసాద్, అంజి, మరో వ్యక్తి కలసి శనివారం రాత్రి పాదయాత్రగా ద్వారకాతిరుమల చిన వెంకన్న సన్నిధికి రోడ్డుపై నడిచి వెళుతున్నారు. నల్లజర్ల మండలం పుల్లలపాడు వద్ద లారీ ఢీకొట్టడంతో దాసు దుర్గాప్రసాద్‌కు తీవ్ర గాయాలు కాగా, అంజి, మరో వ్యక్తికి స్వల్ప గాయాలు అయ్యాయి. దుర్గాప్రసాద్‌ను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అంజి మరో వ్యక్తి రాజమండ్రి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

సిడిపిఒపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఐసిడిఎస్ తాళ్లరేవు ప్రాజెక్ట్ సిడిపిఒ మాధవిపై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు మాట్లాడారు. ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాల్సిన సిడిపిఒ మాధవి నియంతృత్వంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. తమ సమస్యల పరిష్కారానికి ఆందోళన నిర్వహిస్తున్న అంగన్‌వాడీల పట్ల దారుణంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. నాయకులు, ప్రజా ప్రతినిధులు పట్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రాజెక్టులోని అన్ని మండలాల సమావేశాలు ఒకేచోట నిర్వహిస్తూ అంగన్‌వాడీలకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ ఖర్చులను అంగన్‌వాడీలపై వేయడం ఎంతవరకూ సబబు అని ప్రశ్నించారు. సిడిపిఒ స్థానికంగా నివాసం ఉండటం లేదన్నారు. మండల పరిషత్ సమావేశానికి సైతం హాజరు కాకుండా క్రింది స్థాయి ఉద్యోగులను సమావేశానికి పంపడం పరిపాటిగా మారిందన్నారు. సిడిపిఒ వ్యవహార శైలిపై శాఖాపరమైన విచారణ చేసి తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపిడిఒ సత్యనారాయణకు సిడిపిఒపై ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు వల్లు రాజబాబు, విప్పర్తి శ్రీనివాస్, దుప్పి అదృష్టదీపుడు, వడ్డి ఏడుకొండలు, అత్తిలి బాబూరావు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని చూపిస్తున్న ప్రజాసంఘాల నాయకులు



పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎంఎల్ఎ వర్మ

ఉచిత సమ్మర్ కోచింగ్ క్యాంప్ ప్రారంభం

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక ఆర్ఆర్‌బిహెచ్ఆర్ జూనియర్ కళాశాలలో ఉచిత సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ను ఆదివారం మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్ఎన్.వర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది వివిధ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు. ఈ ఏడాది కూడా పతకాలు సాధించాలన్నారు. కూటమి ప్రభుత్వం స్పోర్ట్స్ కోటను 2 నుంచి 3 శాతానికి పెంచిందని, క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఛైర్మన్ రవి నాయుడు స్పోర్ట్స్ రిజర్వేషన్ పెంచడం వలన క్రీడాకారులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కోచ్ పి.లక్ష్మణరావు మాట్లాడుతూ సమ్మర్ కోచింగ్ క్యాంప్ మే 31 వరకు ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు జరుగుతుందన్నారు. ఈ క్యాంప్‌లో ఆర్చరీ, తైక్వాండో, బాక్సింగ్‌లలో ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి ఒలంపిక్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షులు కె.పద్మనాభం, కౌన్సిలర్ రాయుడు శ్రీనివాసరావు, అసోసియేషన్ సభ్యులు సోము గోవిందరాజు, కె.చిన్నబ్బాయి, పి.వేణు, జి.శివప్రసాద్, బి.వంశీ, సతీష్, పిఇటిలు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు, అధికారులు

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యానికి భద్రత

ప్రజాశక్తి - ఏలేశ్వరం

రసాయన ఎరువులు వినియోగించకుండా ప్రకృతి వ్యవసాయంతో పండించిన ఆహారం ప్రజలకు ఆరోగ్య భద్రతను ఇస్తుందని ఎంపిపి గొల్లపల్లి బుజ్జి అన్నారు. ఆదివారం మండలంలోని పేరవరం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో వ్యవసాయం చేస్తే భూమిలో సారం పెరిగి నాణ్యమైన దిగుబడి ఇస్తుందన్నారు. రైతులకు ఖర్చు తగ్గి ఆదాయం పొందేందుకు ప్రకృతి వ్యవసాయం దోహదం చేస్తుందన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ రైతులు కర్రి వీరాస్వామి, దనేకుల భద్రం, డేగల రాంబాబు, నిమ్మగడ్డ సత్యనారాయ ణలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బేరి వరలక్ష్మి, ఎంపిటిసి సభ్యులు కొప్పుల బాబ్జి, జగటాపు సూరిబాబు, వ్యవసాయ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వితంతు పింఛన్ల పరిశీలన పూర్తి చేయాలి


ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలోని 23 గ్రామాల్లో మృతి చెందిన పింఛన్‌దారుల భార్యలకు పింఛన్లు మంజూరు అయ్యాయని, లబ్దిదారుల పరిశీలనను రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఎంపిడిఒ శ్రీలలిత ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మండల పరిధిలో వృద్ధాప్య పింఛన్లు తీసుకుంటూ మృతి చెందిన 180 మంది లబ్దిదారుల భార్యలకు పింఛన్లు మంజూరయ్యాయన్నారు. కొత్తగా పింఛన్లు మంజూరైన వారి పరిశీలన చేసి నివేదికను అందజేయాలన్నారు.

నిలిచిపోయిన ఎపి ఫైబర్ నెట్‌వర్క్

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలో ఎపి ఫైబర్ నెట్‌వర్క్ నిలిచిపోవడంతో వినియోగదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎపి ఫైబర్ నెట్‌వర్క్ ద్వారా టివి ఛానల్‌తో పాటు ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించడంతో కొత్తపల్లి, ఉప్పాడ, కుతుకుడుమిల్లి, వాకతిప్ప, కొండేవరం తదితర గ్రామాల్లో పెద్దఎత్తున వినియోగదారులు ఈ సర్వీసు కనెక్షన్లు తీసుకున్నారు. అయితే నిత్యం ఈ నెట్‌వర్క్‌లో సమస్యలు తలెత్తుతున్నాయి. గ్రామస్థాయి ఆపరేటర్లకు సమాచారాన్ని అందించినా ఫలితం ఉండటం లేదని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఆదివారం సెలవు కావడంతో ఇంటిల్లాపాది టివిల్లో వచ్చే ప్రచారాలను తిలకించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. నెలనెలా బిల్లులు మాత్రం పట్టుకెళ్తున్న ఆపరేటర్లు సమస్యను పట్టించుకోవడం లేదని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వినియోగదారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఉన్నతాధికారులు స్పందించి ఎపి ఫైబర్ నెట్ సౌకర్యాలను మెరుగుపర్చాలని కోరుతున్నారు.



ఎర్రర్ కనెక్షన్ చూపిస్తున్న టివిలు

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని నియోజకవర్గ వైసిపి కో-ఆర్డినేటర్ ముద్రగడ గిరబాబు అన్నారు. ఆదివారం మండలంలోని రాచపల్లి గ్రామంలో ఆయన పర్యటించారు. గుబ్బాలమ్మ జాతరలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వైసిపి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో కూటమి పార్టీలు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నాటకం ఆడుతుందని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో ఏ కార్యకర్తకు కష్టం వచ్చిన అండగా ఉంటానని, రాబోయేది వైసిపి ప్రభుత్వమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి బంకు శ్రీను, వైసిపి నాయకులు రామిశెట్టి నాని, పెదిరెడ్డి నాని, సారిపల్లి గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.



గ్రామంలో పర్యటిస్తున్న గిరిబాబు

పని చేయని లిఫ్ట్..తప్పని ఇక్కట్లు...

ప్రజాశక్తి - సామర్లకోట

అసలే మండు వేసవి కావడం, ప్రయాణికులతో కిక్కిరిసిన సామర్లకోట రైల్వే స్టేషన్లో ఆదివారం లిఫ్ట్ పని చేయకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఒకటి, రెండు ప్లాట్ఫారం కలుపుతూ ఏర్పాటు చేసిన లిఫ్ట్ గత 3 రోజులుగా సరిగా పని చేయడం లేదు. దీంతో వృద్ధులు వికలాంగులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. రైల్వే అధికారులకు స్టేషన్ ఆధునీకరణపై ఉన్న శ్రద్ధ లిఫ్ట్‌పై ఉండటం లేదని పలువురు వ్యగ్యంగా వ్యాఖ్యానిస్తున్నారు. లిఫ్ట్‌కు మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



రైల్వే స్టేషన్‌లో వెలవెలబోతున్న లిఫ్ట్

మెకానికర్ల సంఘం కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - తాళ్లరేవు

యానాం, తాళ్లరేవు మండలాల మెకానికర్ల సంఘం నూతన కమిటీ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. స్థానిక ముత్యాలమ్మ ఆలయ ఆవరణలో సంఘం జిల్లా అధ్యక్షుడు దాశం కన్నారావు, కార్యదర్శి ఎస్‌కె.యాసిన్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలో కమిటీ నూతన అధ్యక్షుడుగా కొప్పిశెట్టి వీర బ్రహ్మాజీ, కార్యదర్శి రాయుడు గోవిందు, కోశాధికారి రాజమేను వీరబాబు, ఉపాధ్యక్షుడు రాయుడు శీను, సహాయ కార్యదర్శి నాటి ధన కామేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు దాసం కన్నారావు మాట్లాడుతూ మెకానికర్ల సమస్యల పట్ల ప్రతి ఒక్కరు అంకితభావంతో కృషి చేయాలన్నారు. మండలంలో మెకానికర్లకు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. 50 సంవత్సరాలు నిండిన ప్రతి మెకానికర్‌కు ప్రభుత్వం పించను సౌకర్యం కల్పించాలని అన్నారు. అనంతరం నూతన కమిటీతోపాటుగా జిల్లా నాయకులను సంఘం సభ్యులు ఘణంగా సత్కరించారు. ఈ సందర్భంగా మెకానికర్లకు ఈ శ్రమ కార్డులను కనకారావు అందజేశారు.



నూతన కమిటీతో జిల్లా నాయకులు

ఫిషర్‌మెన్ సొసైటీ ఎన్నికలు ఏకగ్రీవం

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి ఫిషర్‌మెన్ సొసైటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఛైర్మన్‌గా గుర్రాల శేఖర్, ప్రధాన కార్యదర్శిగా కొమ్ముకూరి శ్రీనులతోపాటు డైరెక్టర్లుగా కోడెల్లి గంగరాజు, దొడ్డి భూషణం, గంధం వెంకటేశులు, గుర్రం సుందర్రావు, ముప్పిడి శాంతారావు, బొట్ట అభిమన్యుడు, దార చంద్రావులు ఎన్నికయ్యారు. టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు యలమాటి కాశి, బొల్లంరెడ్డి రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నిక అనంతరం నూతన పాలకవర్గం ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూను మర్యాదపూర్వకంగా కలిసింది. నూతన కమిటీని ఎంఎల్ఎ సత్కరించారు.



నూతన కమిటీని అభినందిస్తున్న ఎంఎల్ఎ జ్యోతుల

మే 2 నుంచి చిల్డ్రన్స్ క్లబ్ సమ్మర్ క్యాంప్

ప్రజాశక్తి - తాళ్లరేవు

తాళ్ళరేవు చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే సమ్మర్ క్యాంప్‌ను మే 2వ తేదీ నుంచి 11వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు క్లబ్ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం స్థానిక ప్రజాసంఘాల భవనంలో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ సెలవులు సమయంలో చిన్నారులు మొబైల్ ఫోన్, ఇతర వ్యసనాలకు లోను కాకుండా ఆహ్లాదకరమైన వాతావరణంలో వినోదంతో పాటు విజ్ఞానాన్ని అందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని అన్నారు. ప్రతిరోజు ఆటలు, పాటలు, చిత్రలేఖనం, నీతి కథలు, స్పోకెన్ ఇంగ్లీష్, మ్యాజిక్ షోలు, సైన్స్ సంగతులు, క్విజ్, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు ఉంటాయని అన్నారు. సమ్మర్ క్యాంప్ విజయవంతానికి సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో వాసవి క్లబ్ ప్రతినిధి పేకేటి సతీష్, చిల్డ్రన్స్ క్లబ్ ప్రతినిధులు గుత్తుల మల్లేశ్వరరావు, అత్తిలి బాబూరావు, వడ్డి ఏడుకొండలు, పాలిక శ్రీనివాస్, టేకుమూడి ఈశ్వరరావు, కొప్పిశెట్టి అనంతలక్ష్మి, పెయ్యల అనంతలక్ష్మి, సంగాడి కళావతి, దొండపాటి వెంకటలక్ష్మి, దుప్పి అదృష్టదీపుడు, పిబిఎన్.రెడ్డి పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన

ప్రజాశక్తి - పెద్దాపురం

జమ్మూ కాశ్మీర్లో ఉగ్రవాదుల దాడుల్లో మతి చెందిన వారికి డివిజన్ వినియోగదారుల సంఘ సమావేశంలో నివాళులర్పించారు. ఆదివారం రామారావు పేటలోని సంఘ కార్యాలయంలో సంఘ అధ్యక్షుడు బళ్లమూడి సూర్యనారాయణ మూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి ఎం.భాస్కరరావు, ఉపాధ్యక్షుడు కె.సుధాకర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.సత్యనారాయణ, కోశాధికారి శ్యామల, సభ్యులు బి.నాగకుమారి, కెవిపి.లక్ష్మి, జివిఆర్.చౌదరి పాల్గొన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి - గండేపల్లి, పెద్దాపురం

గండేపల్లి మండలంలోని మురారి గ్రామంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మజ్జిగను పంపిణీ చేశారు. అలాగే పెద్దాపురం మెయిన్ రోడ్డులో ప్రయివేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు చింతల సత్యనారాయణ, బనిశెట్టి నాగేశ్వరరావు, నాలం శ్రీనివాసరావు, జాన వీరకృష్ణ, ఉప్పు రాంబాబు, పెన్నేటి రాము, లాలం సత్యనారాయణ పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలం అయిందని వైసిపి మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి ఆరోపించారు. ఆదివారం స్థానిక గైగలపాడులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల ముందు టిడిపి అధినేత చంద్రబాబు ఇచ్చిన హామీలను నమ్మి ప్రజలు మోసపోయారని అన్నారు. వైసిపి పాలనలో తమ అధినేత వైఎస్.జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన ప్రతీ హామీలని తూచా తప్పక అమలు చేశారని అన్నారు. కానీ నేడు అధికారంలో ఉన్న చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని అన్నారు. వాయిదాలు పద్ధతిలో తల్లికి వందనం అమలు చేస్తామనడం సిగ్గుచేటని, తక్షణమే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలన్నారు.

చిరువర్తకుల శాంతి ర్యాలీ

ప్రజాశక్తి - ఏలేశ్వరం

పెహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ చిరువర్తకులు ఆదివారం ఏలేశ్వరంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలమండ నాగేంద్ర, బంక రాజు మాట్లాడుతూ అమాయక పర్యాటకులను అమానుషంగా కాల్చి చంపడం దారుణమన్నారు. అలాగే లింగంపర్తి గ్రామంలో గ్రామ యువత కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

అలంకారప్రాయంగా చలివేంద్రాలు

ప్రజాశక్తి - పిఠాపురం

మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ ఆదేశాలతో మున్సిపల్ అధికారులు ఎంతో ఆర్భాటంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో చలి వేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే వాటి నిర్వహణపై దృష్టి సారించకపోవడంతో పలు చలి వేంద్రాలు నేడు అలంకారప్రాయంగా మారిపోయాయి. చలివేంద్రం కన్పించిన వెంటనే పలువురు బాటసారులు తాగునీటి కోసం ఆగుతున్నారు. అయితే ఆ చలివేంద్రాల్లో తాగేందుకు నీళ్ల లేకపోవడంతో ఉసూరు మంటూ వెనుతిరుగుతున్నారు. స్థానిక పాదగయ సెంటర్ సమీపంలో ఉన్న మున్సిపల్ చలివేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం అటుగా వెళ్ళే పాదచారులు దాహార్తి తీర్చుకునేందుకు వెళ్లారు. అయితే వారికి ఖాళీ మంచినీళ్ల డబ్బాలు దర్శనం ఇచ్చాయి. దీంతో పలువురు బాటసారులు తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు చలి వేంద్రాల నిర్వహణపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.





పూజలు చేస్తున్న ఎస్పి

ఎస్పి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక భీమేశ్వర ఆలయంలో ఆదివారం ఎస్పి జి.బిందుమాధవ్ కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఇఒ ఆధ్వర్యంలో వేద పండితులు అర్చకులు స్వాగతం పలికారు. నంది మండపంలో ప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని పండితులు అందజేశారు.

నేటి నుంచి విధుల బహిష్కరణ

ప్రజాశక్తి - కరప

మండలంలోని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు నేటి నుంచి విధులు బహిష్కరిస్తున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా పనిచేస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతంఉద్యోగ సవరణ చేయాలని గత రెండేళ్లుగా పోరాటం సాగిస్తున్నామని అన్నారు. అయినా ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్ర కమిటీ నిర్ణయం ప్రకారం సోమవారం నుంచి విధులను బహిష్కరించనున్నట్లు రెహానా, ఎస్తేర్‌రాణి, స్వాతి, మౌనిక తెలిపారు.



అన్నదానంలో పాల్గొన్న యాత్రికులు

మరిడమ్మ ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ ఆలయంలో ఆదివారం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. దాతల సహకారాలతో అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఎసి తెలిపారు. ఈ కార్యక్రమంలో పూజారి ఐవి.ప్రసాద్‌శర్మ, వేద పండితులు ఎన్‌వి.అవధాని, శంకర్, ఆసాదులు రాయి నాని, సిబ్బంది పాల్గొన్నారు.